## విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొంరాస్‌పేట, జనవరి 16 : మండలంలోని నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో బుధవారం నుంచి శుక్రవారం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ట్రాన్స్‌కో ఏఈ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీన ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు బొంరాస్‌పేట, తుంకిమెట్ల ఫీడర్లకు, బురాన్‌పూర్, కంకర క్రషర్, మహంతిపూర్, బురాన్‌పూర్ అర్బన్ ఫీడర్‌కు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలి పారు. 18వ తేదీన ఉదయం 8 నుంచి 11 వరకు మెట్లకుంట, ఏర్పుమళ్ల, కొత్తూరు, మదన్‌పల్లి ఫీడర్లకు, బాపల్లితండా, సాలిండాపూర్ ఫీడర్లకు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు, 19వ తేదీన ఈర్లపల్లి ఫీడర్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగరాజు తెలిపారు.

## మెట్లకుంటకు నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించాలి

బొంరాస్‌పేట, జనవరి 16 : మండలంలోని మెట్లకుంట గ్రామానికి గతంలో ఉన్న నైట్ హాల్ట్ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధ రించాలని గ్రామస్తులు కోరుతున్నారు. తాండూరు నుంచి రాత్రి 10.30కు మెట్లకుంటకు చేరుకుని ఉదయం 5.30 గంటలకు తాండూరు వెళ్లేవిధంగా గతంలో తాండూరు డిపో అధికారులు బస్సును నడిపేవారని దీనిని అర్ధాంతరంగా రద్దు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నైట్‌హాల్ట్ బస్సు సర్వీసు యాలాల, బొంరాస్‌పేట మండ లాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని దీనిని పునరుద్ధరించాలని ప్రజలు తాండూరు ఆర్టీసి అధికారులను కోరుతున్నారు.

## అంత్యక్రియలకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు...

బొంరాస్‌పేట, జనవరి 16: బంధువుల అంత్యక్రియల్లో పాల్గొని ఇంటికి తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్ సమీపంలోని బొంరాస్‌పేట గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. ఎస్సై శంకర్ కథనం ప్రకారం ధారూరు మండలం అంపల్లి గ్రామానికి చెందిన పత్తి వినయ్‌కుమార్(47) సోమవారం కొడంగల్‌లో బంధువుల అంత్యక్రియల్లో పాల్గొని బైకుపై ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. బొంరాస్‌పేట గ్రామానికి సమీపంలో జోకుంట మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారు బైకును ఢీకొనడంతో వినయ్‌కుమార్‌కు తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మృతుడి సోదరుడు సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

## తాండూరులో మూడు ఆధార్ సెంటర్లు

తాండూరు రూరల్, జనవరి 16: తాండూరు పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో కొత్తగా మూడు ఆధార్ సెంటర్లను ప్రారంభించినట్లు ఆర్డీవో శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో పోస్టాఫీస్ కార్యాలయంలో ఒక కేంద్రం మాత్రమే కొనసాగేదని, రద్దీ కారణంగా పాత మున్సిపల్ కార్యాలయంలో మూడు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. రోజు ఉదయం 10 గంటలకు 150 టోకెన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ ఆధార్ కేంద్రంలో మొబైల్ నెంబరు అప్‌డేట్, ఫొటో, బయోమెట్రిక్, ఈ కేవైసీ, పేరు, ఇంటి పేరు సవరణ వంటివి చేయనున్నట్లు తెలిపారు. నూతన ఆధార్ కార్డు, చిరునామా సవరణ వంటివి అందుబాటులో లేవని ఆయన స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

వికారాబాద్, జనవరి 16 : గుర్తు తెలియని మహిళ మృత దేహం లభ్యమైన ఘటన పులుమద్ది గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. వికారాబాద్ సీఐ శ్రీను, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... వికారాబాద్ మండలం పులుమద్ది గ్రామానికి చెందిన శంకర్ వ్యవసాయ పొలం వద్ద గుర్తు తెలియని మహిళ (30-35) మృత దేహం ఉన్నట్లు సమాచారం తెలిసిందన్నారు. ఘటనా స్థలానికి వెళ్లి చూడగా మృత దేహం పై కొట్టి, చీరతో ఆమె మెడకు బిగించి చంపి పొలం వద్ద పారవేసి నిప్పం టించినట్లు ఉందన్నారు. గుర్తు పట్టనట్లుగా మొహం కాలిపోయిందన్నారు. మృతి రాలి ఒంటిపై ఆకుపచ్చ జాకెట్, ఆకు పచ్చరంగు చీర ఉన్నాయన్నారు. మృతురాలిని ఎవరైనా గుర్తుపట్టినచో వికారాబాద్ సిఐ (8712670030) నంబర్ కు సమాచారం ఇవ్వాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**PUBLIC NOTICE**

This is to inform the General Public that my client Mr. MUKUND GADGILS/o Mr. VASANTH GADGIL has lost his original LINK document deed No. 3001 of 1983, registered in the office of Sub-Registrar, Hayathnagar (1502) of the property situated bearing Plot No. 28, admeasuring 274 Sq. Yards, in the approved layout of Gayatri Nagar, Sahebnagar Kalan Village, Hayathnagar Revenue Mandal, Ranga Reddy District having purchased the same vide document No. 3001 of 1983 dt. 28-04-1983 registered in the office of Sub Registrar, Hyderabad East, Hayathnagar and if anybody has found the same may be returned to the legal advisor at the address given below within 15 days from the date of Publication of this Notice failing which it will be presumed that the same has been lost and a lost document certificate shall be obtained.

Sd/- P.L.N.SIMHAM AND ASSOCIATES
LAKSHMI NARASIMHAM POLAVARAPU
ADVOCATE AND NOTARY
5-4-690, Plot No. 79, YADI REDDY THOTA
KAMALANAGAR, VANASTHALIPURAM,
HYDERABAD-500070. CELL:: 7396134491

# 'పీఎం జన్‌మన్'తో చెంచులకు మంచిరోజులు



జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మనోహర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డిలతో కలిసి నూతన అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

- చైతన్య నగర్‌లో పీఎం మోదీతో కలిసి వర్చువల్‌గా పీఎం జన్‌మన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- స్వదేశీ దర్శన్ పేరుతో రూ.100 కోట్లతో అనంతగిరి కొండలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధిచేస్తాం

పెద్దేముల్, జనవరి 16: పీఎం జన్‌మన్ కార్యక్రమం ప్రారంభంతోనే ఆదివాసీ, గోండు, చెంచు జాతి బిడ్డల జీవితాల్లో నిజమైన సంక్రాంతి పండుగ వాతావరణం కనపడుతున్నదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చైతన్యనగర్ గ్రామంలో పీఎం జన్‌మన్ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, చెంచుజాతి ప్రజలు, ఆయా శాఖల అధికారుల సమక్షంలో పీఎం మోదీతోకలిసి లైవ్ స్క్రీన్ వర్చువల్‌గా ఒకేసారి ప్రారంభించారు.ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో కనీస వసతులు లేవని,అలాంటి గ్రామాలకు న్యాయం జరగాలన్నారు. కేంద్ర ప్రభుత్వంలో 11 శాఖలు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ఆదివాసీ గ్రామాల్లో గ్రామసభలు పెట్టి సమస్యలు గుర్తించి,పీఎం జనమన్ కింద లక్షమంది అకౌంట్లలో నేరుగా డబ్బులు వేసి వేయికిలోమీటర్ల మేరరోడ్డును వేసి 27వేల ఇండ్లకు నల్లా కనెక్షన్‌లు,100 మొబైల్ సెంటర్లు,100 హాస్టల్‌లు, 503 గ్రామాలకు టవర్లు,300 అంగన్‌వాడీ స్కూల్స్,83 వేల మందికి ఆయుష్మాన్ కార్డులు,10 వేల మందికి పట్టాభూములు,కిసాన్ క్రెడిట్ కార్డులు పీఎం మోదీ కృషితో అందిస్తునామన్నారు. రాబోయే రోజుల్లో ఆదివాసీ,చెంచుజాతి బిడ్డలకు కులం సర్టిఫికెట్లు అందించి వారి హక్కులను కాలరాయకుండా కాపాడుతున్నామన్నారు అంతకుముందు పీఎం జన్‌మన్ కార్యక్రమాన్ని పీఎం మోదీతో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన లైవ్ స్క్రీన్‌లో ప్రధాని మోదీ ఆయా రాష్ట్రాల ఆదివాసీ ప్రజలతో మాట్లాడిన తీరును వీక్షించారు.అనంతరం మోదీ సందేశాన్ని చైతన్య నగర్ గ్రామ ప్రజలు,ప్రజాప్రతినిధులు,నాయకులు,అధికారులతో కలిసి వీక్షించి శ్రద్ధగా విన్నారు. తరువాత ఓ నూతన అంబులెన్స్‌ను వైద్య సిబ్బందితో కలిసి ప్రారంభించి, అక్కడ ఏర్పాటుచేసిన వివిధ స్టాల్‌లను పరిశీలించి సిబ్బందితో మాట్లాడి స్టాల్‌లకు సంబంధించిన అంశాలను అడిగి తెలుకొన్నారు.అనంతరం పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు,ఆయా పార్టీల నేతలు మంత్రిని ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో సర్పంచ్ పి.లలిత, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతా మహేందర్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు ఆర్డీవో శ్రీనివాస్‌రావు,ఎంపీపీ అనురాధ,జడ్పీటీసీ ధారాసింగ్,గిరిజన సంక్షేమశాఖ ఏడీ సర్వేశ్వర్ రెడ్డి,సంచాలకులు ఇందిరా,జిల్లా అధికారి కోటాజీ,డీపీఓ తరుణ్‌కుమార్, మోటార్ అసిస్టెంట్ కమిషనర్ హర్షఅగ్నిహోత్రి, పంచాయతీ కార్యదర్శి నాగరాణి,నాయకులు లక్మారెడ్డి, రమేశ్, మహిపాల్‌రెడ్డి, నారాయణ రెడ్డి, శోభమ్మ,శ్రీనివాస్‌రెడ్డి,మురళీ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### స్వదేశీ దర్శన్ పేరుతో అనంతగిరిని పర్యాటక కేంద్రంగా ...

హైదరాబాద్‌కు దగ్గర ఉన్న జిల్లా వికారాబాద్ జిల్లా అని సాగునీటి సౌకర్యం అతి తక్కువ ఉన్న జిల్లా అని జిల్లాను నూతనంగా ఎన్నికల్లో గెలిచిన నాయకులు,ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అనంతగిరిని స్వదేశీ దర్శన్ పేరుతో రూ.100 కోట్లతో పర్యాటక అభివృద్ధి కేంద్రంగా తయారు చేస్తామని, అందులో భాగంగా పార్కుల నిర్మాణం, సైకిలింగ్, పర్యాటకుల విడదికి నివాసాలు ఏర్పాటు చేస్తామని,అనంతగిరిని పర్యాటక కేంద్రం మార్చడానికి తెలంగాణ ప్రభుత్వం కూడా ముందుకు వచ్చిందని,డీపీఆర్ రెడీ అయిందని త్వరలో రాష్ట్ర ప్రభుత్వ టెండరుతో రూ.100 కోట్లతో అనంతగిరిని అభివృద్ధి చేసి చూపిస్తామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

### ఎస్సీ వర్గీకరణ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలి

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సమస్యను పరిష్కరించడాన్ని వేగవంతంగా పరిష్కరించేటట్లు చొరవ తీసుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు ఆనంద్ మాదిగ సోమవారం కేంద్రం మంత్రి జి.కిషన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జనగాం స్వామిదాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లిఖార్జున్ మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి ప్రకాశ్ మాదిగ,కార్యదర్శి అంజి మాదిగ,జానీ మాదిగ,విద్యార్థి నాయకుడు సదానందం మాదిగ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేయండి

**తాండూరు రూరల్:** తాండూరులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడంతోపాటు నియోజకవర్గం కేంద్రంగా పలు జాతీయ రహదారుల విస్తరణకు,కోట్‌పల్లి,అనంతగిరిలను పర్యాటక కేంద్రాలుగా మార్చేవిధంగా కృషి చేయాలని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సోమవారం కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందించి,పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డితో పలు అంశాలను చర్చిస్తూ తాండూరు అభివృద్ధికై నియోజకవర్గం కేంద్రంగా మన్నెగూడ నుండి తాండూరు వరకు,తాండూరు నుండి జహీరాబాద్ వరకు నాలుగులైన్ల రోడ్డు పనులకు నిధులు మంజూరుచేసి పనులు ప్రారంభించేలా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు అవసరం ఉందన్నారు.

### అనంతపద్మనాభస్వామిని దర్శించుకున్న కిషన్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 16 : వికారాబాద్ అనంతగిరి శ్రీ అనంత పద్మనాభ స్వామి వారిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, ఆశీర్వాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ధర్మకర్త యన్. పద్మనాభం, ఈవో టీ.నరేందర్‌లు కేంద్రమంత్రి కి స్వామి వారి ఫోటో బహుకరించారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని, దేవాలయం దగ్గర గల భూమి సమస్య పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానంద్‌రెడ్డి, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

### కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి కృషి

ధారూరు, జనవరి 16: ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు తీసుకొచ్చి పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టును సందర్శించి, ప్రజా ప్రతి నిధులతో కలిసి బోటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్‌పల్లి ప్రాజెక్ట్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నాయకులు పాండుగౌడ్, రాములు, కృష ఉన్నారు.

# ఇంటింటికీ రాములవారి అక్షింతలు..



కొడంగల్: ఇంటింటికీ రాముల వారి అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు

కొడంగల్, జనవరి 16: అయోధ్యలో రాముడి ఆలయ ప్రారంభాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాల్లో రాముని భక్తులు అయోధ్య నుంచి వచ్చిన రాములవారి అక్షింతలను పూజలు నిర్వహించి ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. మంగళవారం పట్టణంలో రాముని భక్తులు ఇంటింటినీ సందర్శించి రాముల వారి అక్షింతలను పంపిణీ చేశారు.

**పెద్దేముల్:** మండల పరిధిలోని నాగులపల్లికి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో సోమవారం గ్రామస్తులు, పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం ఊరేగింపుగా ఇంటింటికీ వెళ్లి అక్షింతలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో హనుమాన్ మందిరం భజన మండలి, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

**కులకచర్ల:** మండల పరిధిలోని చాపలగూడెం గ్రామంలో సర్పంచ్ గండి లక్ష్మయ్య ఆధ్వర్యంలో హిందూ ఉత్సవ సమితి సభ్యులు ఇంటింటికీ తిరిగి అక్షింతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండ అంజిలయ్య, రాములు, కృష్ణారెడ్డి, మొగులయ్య, గోపాల్, సత్యయ్య, రాములు, బసప్ప, ఆంజనేయులు, రాములు, కృష్ణయ్య, ఆంజనేయులు, శివకుమార్, శ్రీనివాస్, భజనమండలి సభ్యులు పాల్గొన్నారు. అలాగే బొంరెడ్డిపల్లి గ్రామంలో హిందూఉత్సవ కమిటి ఆధ్వర్యంలో అక్షింతలను ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భజనలు చేశారు.

# ఘనంగా సంక్రాంతి పండుగ



పరిగిలో పతంగుల సెలబ్రేషన్స్‌లో ఆర్యవైశ్య మహిళలు



వికారాబాద్: ముగ్గు వేస్తున్న మహిళలు

పరిగి, జనవరి 16 : పరిగి పట్టణంతోపాటు మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా భోగి మొదలుకొని మకర సంక్రాంతి, కనుమ పండుగ వరకు మహిళలు తమ వాకిళ్లను అందమైన రంగురంగుల ముగ్గులతో అలంకరించి పండుగకు స్వాగతం పలికారు. చిన్నారులు పతంగులు ఎగురవేసి ఉత్సాహంగా పండుగ జరుపుకున్నారు. సంక్రాంతి సందర్భంగా పట్టణాలలో ఉండే వారంతా సొంతూళ్లకు చేరుకోవడంతో గ్రామాలు సందడిగా మారాయి.

వికారాబాద్: సంక్రాంత్రి, కనుమ పండుగ రోజున ఇండ్ల ముందు మహిళలు అందంగా ముగ్గులు వేసి వాటికి రంగులు అద్దారు. చిన్నారులు సైతం రంగులు నింపడంలో ఆసక్తిగా పాల్గొన్నారు. గాలి పటాలను ఎగరవేయడంలో చిన్నారులు, పెద్దలు ఆనందంగా మునిగిపోయారు. సంక్రాంతి సందర్భంగా మరి కొంత మంది యువకులు క్రికెట్, వాలీబాల్ తదితర ఆటలను ఆడారు. ఇండ్ల నుండి గాలిపటాలు ఎగరవేస్తూ, సౌండ్ బాక్సులతో ఆట, పాటలు నిర్వహించి సందడి సందడిగా గడిపారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ధారూరు, జనవరి 16: మండల పరిధిలోని మోమిన్‌ఖుర్దు గ్రామానికి చెందిన బంటు నర్సింహులు(48) వ్యవసాయం చేసు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలం నుంచి మద్యానికి బానిసై ప్రతి రోజు మద్యం తాగేవాడు. తన వద్ద పైసలు లేక పోవడంతో భార్య చిన్న బాబమ్మను అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. నోట్లో నుంచి నురుగు వస్తుండడంతో ఇంటి చుట్టు పక్కల వారి సాయంతో 108 వాహనంలో వికారాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించామని, చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు వారు తెలిపారు.మృతుడి భార్య చిన్న బాబమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నేడు మండల సమావేశం

పెద్దేముల్, జనవరి 16: మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో ఎంపీపీ అనురాధ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

## ఆలయం చుట్టూ వాహనాల ప్రదక్షిణ

కులకచర్ల, జనవరి 16: చౌడాపూర్ మండల పరిధిలోని చాకల్‌పల్లి గ్రామంలో హనుమాన్ దేవాలయం వద్ద బండ్లు తిరిగే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ రాములమ్మశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఉన్న ఎద్దుల బండ్లను, వాహనాలను దేవాలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వెంకటయ్య, చెన్నయ్య, వెంకట్‌రాములు, చంద్రశేఖర్, అంజయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో వ్యకి మృతి

దోమ, జనవరి 16: దోమ పోలీసు స్టేషన్ పరిధిలోని గూడూరు గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన చోటుచేసుకున్నది. కుల్కచర్ల మండల పరిధిలోని పుట్ట పహడ్ గ్రామానికి చెందిన వడ్డె రామాంజనేయులు (38) దోమ మండల పరిధిలోని గూడూరు గ్రామానికి చెందిన వడ్డె తిరుమలమ్మ, రాములు దంపతుల కుమార్తె అలివేలును 15 సంవత్సరాల క్రితం ప్రేమ పెండ్లి చేసుకొని అత్తగారి ఇంటికి సమీపంలో నివాసం ఉంటున్నారు. మూడు సం వత్సరాల నుంచి కుటుంబంలో తరచుగా గొడ వలు జరుగుతున్నాయి. ఈ నెల 15న భార్య, అత్తామామలు బామ్మర్ది నర్సింహులు తనను కొట్టినట్లు తండ్రి కృష్ణప్పకు ఫోన్‌లో వివరించినట్లు మృతుడి తండ్రి తెలిపారు. వారి దెబ్బలకు తాళలేకనే తన కొడుకు చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెంది ఉంటాడని కృష్ణప్ప అనుమానం వ్యక్తం చేస్తూ దోమ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై రవి గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నా రు.

## దేశరక్షణలో ఆర్మీ జవాన్ల పాత్ర వెలకట్టలేనిది



ఆర్మీదినోత్సవంలో పాల్గొని మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీశైలం

కులకచర్ల, జనవరి 16 : దేశరక్షణలో ఆర్మీజవానుల పాత్ర వెలకట్టలేనిదని కులకచర్ల ఎస్ఐ శ్రీశైలం అన్నారు. సోమవారం రాత్రి కులకచర్ల మండల కేంద్రంలోని పెద్ద గేటు చౌరస్తాలో గ్రామ యువజన సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆర్మీదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్మీడే సందర్భంగా కేక్ కట్‌చేసి ఆర్మీ జవాన్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తుప్పలి అమరేందర్, జోగు బాల్‌రాజ్, సత్యం, యువకులు ప్రేమ్‌కుమార్, బజరంగ్, నవీన్, కాటన్‌పల్లి మధు, కాటన్‌పల్లి శ్రీశైలం, శ్రీనాథ్, ఆర్మీరాములు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డికి నివాళులు



పరిగి, జనవరి 16: ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత, కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో మంగళవారం జరిగిన కార్య క్రమంలో పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొని జైపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను వారు గుర్తు చేశారు.

## వాలీబాల్ పోటీల విజేత కొడంగల్



కొడంగల్ జట్టుకు నగదు అందజేస్తున్న గురునాథ్‌రెడ్డి

బొంరాస్‌పేట, జనవరి 16 : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలలో కొడంగల్ జట్టు విజేతగా నిలిచింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 20 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. దోమ మండలం పాలేపల్లి, కొడంగల్ జట్లు ఫైనల్‌కు చేరి తలపడగా కొడంగల్ జట్టు విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన కొడంగల్ జట్టుకు రూ.15 వేలు, పాలేపల్లి జట్టుకు రూ.10 వేల నగదు బహుమతిని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజేష్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, అంజిలయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు రెడ్డి శ్రీనివాస్, కృష్ణంరాజు, పోటీల నిర్వాహకులు విజయ కుమార్, కుర్మయ్య, సంతోష్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీలకు విశేష స్పందన



కొడంగల్, జనవరి 16: యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాములు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటమిలు సహజమని క్రీడా స్ఫూర్తితో గెలుపు ఓటమిలను సమానంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు కటకం శివ కుమార్, కాంగ్రెస్ యువజన సంఘం జాతీయ నాయకులు కృష్ణంరాజు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు యూసుఫ్, మండల నాయకులు నందారం ప్రశాంత్, సర్పంచ్ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవ్‌రెడ్డితో పాటు మిఠాయిరాజు, రాధాకృష్ణ, రెడ్డిశ్రీను, జయతీర్థాచారి పాల్గొన్నారు.

## క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీటీవో కాట్రావత్ రాంచందర్

కులకచర్ల, జనవరి 16: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని మెదక్ జిల్లా సీటీవో కాట్రావత్ రాంచందర్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడాపోటీల ముగింపు సందర్భంగా విజేతలకు గ్రామస్తులతో కలిసి బహుమతులు అందజేశారు. క్రీడలకు తనవంతు సహాయ సహకారాలను అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఎల్పటీ అశోక్‌కుమార్, వెంకట్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు తగిన ప్రోత్సాహమిస్తా



క్రీడాకారులకు స్పోర్ట్స్ టీషర్టులను అందజేస్తున్న సర్పంచ్ సామ్యావెంకట్‌రాంరెడ్డి

కులకచర్ల, జనవరి 16: క్రీడల ప్రోత్సాహానికి తనవంతు కృషిచేస్తానని కులకచర్ల సర్పంచ్ పట్లోళ్ల సౌమ్యావెంకట్‌రాంరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో క్రీడాకారులకు స్పోర్ట్స్ టీషర్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత క్రీడల్లో ఆసక్తిని కనబర్చి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు

## ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



దోమ, జనవరి 16: మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం వికారాబాద్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహిళలకు, విద్యార్థినిలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సావిత్రి, మాధవి అనే మహిళలకు సర్పంచ్ జగని వెంకటయ్య,కార్మిక సంఘం కార్యదర్శి ఎం వెంకటయ్య బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు,కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సత్తయ్య, నాయకులు రఘురాం,దిర్సంపల్లి సత్యయ్య పాల్గొన్నారు.